# చీరా! చీరా! నీ ఖరీదెంత?

బొంబే నుంచి కొత్తస్టాక్ వచ్చింది. దాన్ని సర్దుకోవడంలో "లక్ష్మీ సిల్క్ హౌస్" స్టాఫ్ బిజీగా వుంది.

రాత్రి పది దాటినా తలుపుల్ని లోపల నుంచి వేసుకుని స్వామి, అతని సహచరులు సతమతమైపోతున్నారు.

వైరైటీవారీగా సర్దడం.... వాటిమీద కోడ్‌ని అనుసరించి చీరలకు తగిలించివున్న టాగ్‌లమీద రేట్లు వెయ్యడం.... బిజీ....బిజీ....!

ఆ కోడ్ నెంబరు దానిమీద రేటుతో వాళ్ళందరూ పసిగట్టేయ గలరు ఆ చీరమీద ఎంత లాభం వేసుకున్నది! దాన్నిబట్టే కస్టమర్లు బేరాన్ని వప్పుకునేది!

ప్రతీ కస్టమర్‌కి బేరంచేసి కొంటేనే తృప్తి వుండేది. వాళ్ళకి ఆ తృప్తినివ్వాలంటే చీరమీద ఖచ్చితమైన రేటు వేసుకుంటే ఇబ్బంది! అందుకని ఓ యాభై రూపాయలు ఎక్కువ వేసుకుని కస్టమర్ గీచి గీచి బేరమాడిన తర్వాత ఓ పాతిక రూపాయలు తగ్గిస్తే ఇద్దరికీ ఆనందం! ఇది స్వామి సూత్రం! ఆ సూత్రం కోసం తహ తహ....!!

"ఈ బ్లూ సారీ మనకెంతపడింది?" అసిస్టెంట్‌ని అడిగాడు స్వామి.

"నూటయాభై...."

"అయితే దానిమీద రెండువందలు వెయ్యి...."

ఆ చీర తగిలించి వున్న టాగ్‌మీద రెలదువందలు వేశాడు అసిస్టెంట్.

చకచకా అన్ని చీరలమీద ధరలు వేసేస్తున్నారు.... ఎంత రాత్రయినా ఈరోజే చీరలన్నిటికి ధరలు వెయ్యడం అయిపోవాలి....

* * *

''స్వామీ! నీ దగ్గర పదేళ్ళనుంచి బట్టలు తీసుకెళ్తున్నాను.... నాలాంటి వాళ్ళకి కూడా ధర తగ్గించకపోతే బాగుండదు....'' బ్లూ సారీని చేతిలోకి తీసుకుంటూ అడిగాడు బాబూరావు.

''ఆ చీర అంతకన్నా తక్కువకి రాదండి! నూటయాభైలో కావాలంటే ఈ చీర తీసుకోండి....'' మరో చీరని చూపించాడు లక్ష్మీసిల్క్ ప్రొప్రయిటర్ స్వామి.

''నాకు ఈ బ్లూ శారీయే నచ్చింది....అదక్కర్లేదు.... పోనీ, నూట డెబ్బయిఅయిదుకియ్యి...."

''మాకు పడదండి ఆ రేటు. మీరు కాబట్టి నూటతొంభైకిస్తాను...."

"సరే, ఇద్దరికీ మధ్యంగా వుండేట్లు నూట ఎనభైకియ్యి...." రాజీకి వచ్చాడు బాబూరావు.

"రెగ్యులర్ కస్టమర్ మిమ్మల్ని కాదనడంకన్నా నష్టాన్ని భరించడమే మంచిది. ఈ ఒక్క చీర చాలంటారా? ఇంకా ఏమైనా కావాలా?''

''ఇంకేమీ వద్దు అది ప్యాక్ చేయించు చాలు."

చకచకా ఆ చీరని ప్యాక్‌చేసి ఇచ్చాడు స్వామి. అందుకుని షాపులోంచి బయటపడ్డాడు బాబూరావు.

తన పుట్టినరోజుకి చీర తేలేదంటూ రెండ్రోజులనుండి కోల్డ్‌వార్ చేస్తోంది రాణి. ఈ పూట గనక దీన్ని తీసుకెళ్ళకపోతే కోల్డ్‌వార్ కాస్తా డైరెక్ట్‌వారుగా మారితీరుతుంది. అందుకే నెలాఖరు రోజుల్లో ఏడెంతచెబితే అంతకి తీసుకోక తప్పలేదు తనకి.

హఠాత్తుగా బాబూరావు మెదడులో ఓ మెరుపుమెరిసింది.

దీన్ని రెండొందలయాభైకి కొన్నట్లు రాణికి చెప్పాలి. ఎంత ఖరీదయిన చీరని తెస్తే ఆడవాళ్ళకి అంత ఆనందం!

* * *

"రమా! ఈ చీర ఎలావుంది?'' స్నేహితురాలిని అడిగింది రాణి.

''చాలా బావుందే! ఎంతకి కొన్నారు?''

"మూడొందలు...." చటుక్కున అనేసింది రాణి. తన పుట్టిన రోజుకి వాళ్ళాయన రెండొందల యాభై పెట్టి చీర కొన్నారని గర్వంగా చెప్పింది. ఇప్పుడు మూడొందలని చెప్పకపోతే తన అధిక్యత నిలిచేదెలా?

"మూడొందలా....?!

రమ మాటలోని ఆశ్చర్యానికి వేరే అర్థాన్ని తీసుకుని "నేను వద్దని పోరినా మా ఆయన వూరుకుంటేనా? బలవంతాన ఈ చీర తీసుకొచ్చారు.... పుట్టిన రోజుకి కొత్త చీర లేకుండా ఎలా? అంటూ" అనేసింది రాణి.

రమ మారుమాట్లాడలేకపోయింది.

అంచెలంచెలుగా ఆ చీరని తనకి తెలిసిన వాళ్ళందకి చూపించి దాని ధర గురించి గొప్పగా చెప్పుకుంది రాణి.

విశాలికి కూడా ఆ చీర ఎంతో నచ్చింది. అందుకే మిత్రురాలి నడిగి ఒకసారి భర్తకి చూపించి అటువంటి చీరను కొనమని అడుగుతానని రాణి చీరని పట్టుకెళ్ళింది.

ఆ రాత్రి ఇంట్లో బాంబుని పేల్చింది. ఇక చేసేదిలేక ఆ చీరని చూపించమన్నాడు ఆమె భర్త రాజారావు.

"నాకు అదే రంగుచీర కావాలి. లేకపోతే రాణి ముందు చులకనై పోతాను." గారాలు పోయింది విశాలి.

"అలాగే.... ఇలాంటి చీరే తెస్తాగా!" భార్యని శాంతపరిచాడు రాజారావు.

మర్నాడు ఆ చీరని పట్టుకుని స్నేహితుడు సదానందం దగ్గరకి పరుగెత్తాడు.

"మూడొందలు రూపాయలట! తక్షణం ఇలాంటి చీరొకటి ఇన్స్టాల్మెంట్స్‌లో ఎక్కడయినా ఇప్పించు. లేకపోతే మూడొందలు ఇచ్చి పుణ్యం కట్టుకో." మిత్రుణ్ణి శరణు వేడాడు.

ఆ మిత్రుడు అభయమిచ్చి. రాజారావ్‌ని లక్ష్మీసిల్క్ హౌస్‌కి తీసుకెళ్ళాడు.

'చూడు స్వామీ! ఈయన రాజారావని నా క్లోజ్ ఫ్రెండ్. మా ఆఫీస్‌లోనే పనిచేస్తున్నాడు. ఇతనికి ఇలాంటి చీరే కావాలి. రెండు ఇన్‌స్టాల్మెంట్స్‌లో కట్టేస్తాడు.'' సదానందం మిత్రుణ్ణి పరిచయం చేశాడు లక్ష్మీసిల్క్ ప్రొప్రయిటర్‌కి.

"అలాగేనండి.... దీన్ని ఎంత కొన్నారండి?...." రాజారావుని అడిగాడు స్వామి.

"నేను కొనలేదు.... మా ఆవిడ స్నేహితురాలు...."

''అదేలెండి.... ఆవిడే! ఎంతకి కొన్నారు?"

"మూడొందలుట!"

"ఎందుకండీ? నేను రెండొందల డెబ్బయి అయిదుకే ఇస్తాను. మీరు మాత్రం ఇక ఎప్పుడు బట్టలు కావాలన్నా మా షాప్‌కే రండి...."

స్వామి మాటలకి మిత్రులిద్దరూ ఆనందపడిపోయారు.

"ఎప్పుడు బట్టలు కావాలన్నా నీ దగ్గరకే వస్తా''మని మొదట ఇన్‌స్టాల్మెంట్ నూటయాభై చెల్లించి బయటపడ్డారు.

సదానందానికి కృతజ్ఞతలు చెప్పుకుని రాజారావు ఇంటిదారిపట్టాడు.

సరిగ్గా అదే సమయంలో స్వామి తన అసిస్టెంట్‌లను కేకేసి ''ఈ రోజు కూడా రాత్రి కాసేపు కూర్చుని స్టాక్‌కి రేట్లేద్దాం" అన్నాడు.

''అదేంటి సార్! కొత్త స్టాకేమీ రాలేదుగా?'' అయోమయంగా అడిగాడు ఓ అసిస్టెంట్.

''ఉన్న స్టాక్‌కే డిమాండ్ పెరిగిందయ్యా.... ఇప్పుడున్న రేటు టాగ్‌లను మార్చి వేరే టాగ్‌లను తగిలించాలి." చిద్విలాసంగా నవ్వాడు స్వామి. *

(కలువబాల పక్షపత్రిక, జనవరి 1-15, 1986)